# అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 310 | వరంగల్ | బుధవారం, 16 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06


- ఎర్రవల్లి ఫాంహౌస్‌పై 30 రోజుల్లో విచారణ పూర్తి చేయాలి
- 700 ఎకరాల భూమిపై కలెక్టర్‌కు రేవంత్ ఆదేశాలు
- అక్రమంగా ఉంటే స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ
- ఎస్సీలను యజమానులుగా చేస్తామని ప్రకటన
- కేసీఆర్ కుటుంబ భూముల వివరాలను అసెంబ్లీలో వెల్లడించిన సీఎం





### ఫాంహౌస్ భూములపై

# సీఎం కొరడా!

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కీలక ఆదేశాలు జారీ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లిలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని, నిర్ణీత గడువులోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. విచారణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 30 రోజుల్లో విచారణ పూర్తి చేసి ఫాంహౌస్ పరిధిలోని భూములపై స్పష్టత ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు సీఎం తెలిపారు. ఫాంహౌస్ పరిధిలో సుమారు 700 ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొన్న ఆయన.. అందులో ప్రభుత్వ, ఇతర కేటగిరీల భూముల పరిస్థితిని తేల్చాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని, శుద్ధి చేసిన భూమికి ఎస్సీలను యజమానులుగా చేస్తామని ప్రకటించారు.

*- అక్షరశక్తి, హైదరాబాద్*

4

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్ టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**సీడీఎంఏ డాక్టర్ టీకే. శ్రీదేవి.. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్**

**పాల్గొన్న కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కమిషనర్ వెంకన్న**



2

## తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ

- సింగపూర్ వాణిజ్య– పరిశ్రమల శాఖ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
- రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించిన సీఎం
- డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం
- మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికలపై చర్చ



3

# తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ

- సింగపూర్ వాణిజ్య–పరిశ్రమల శాఖ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
- రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించిన సీఎం
- డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం
- మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికలపై చర్చ



**అక్షరశక్తి, హైదరాబాద్ :** తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సింగపూర్ ప్రతినిధి బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. సింగపూర్ వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వశాఖ ఇంధన-వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, హైదరాబాద్ భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని సీఎం సింగపూర్ ప్రతినిధులను కోరారు. పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో పెట్టుబడులపై సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు వెల్లడైంది. డిసెంబరులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని అగస్టిన్ లీని సీఎం ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారిశ్రామిక అవకాశాలను ఆయన ప్రతినిధి బృందానికి వివరించారు. తెలంగాణలో పెట్టుబడుల కోసం ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' వ్యవస్థను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ నిర్వహిస్తోంది.

**మూసీ, ఫ్యూచర్ సిటీపై ప్రజెంటేషన్**

మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను కూడా సీఎం సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. తొలిదశలో మూసీ-ఈసా నదుల సంగమ ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మూసీ రివర్‌ఫ్రంట్‌తో పాటు హైదరాబాద్‌లో నైట్ ఎకానమీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

**విద్యా సంస్థల క్యాంపస్‌లపై ప్రస్తావన**

హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. విద్య, పరిశోధన, సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతోందని సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్‌తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి చర్యలు

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**అక్షరశక్తి,ములుగు:** లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలు తదితర పునరావాస ప్రయోజనాలు కల్పించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పునరావాస ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

**శాసనసభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**అక్షరశక్తి, హైదరాబాద్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో పామ్ ఆయిల్ సాగు చేసే రైతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, వెంటనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా వ్యవసాయ రంగంపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, పంట మార్పిడిపై రైతులకు కల్పిస్తున్న అవగాహన వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు వరి, పత్తి వంటి పంటలకు బదులుగా పామ్ ఆయిల్ సాగు వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని కడియం శ్రీహరి తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అధిక స్థాయిలో పంట సాగవుతోందని, రాబోయే రోజుల్లో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. అయితే ఫామ్ ఆయిల్ గెలలు నరికిన వెంటనే, అంటే 24 గంటల్లోపు ఫ్యాక్టరీకి తరలించి ప్రాసెసింగ్ చేయాల్సి ఉంటుందని, సమయం దాటితే పంట నాణ్యత తగ్గి రైతులకు నష్టం జరుగుతుందని గుర్తుచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఫ్యాక్టరీ ఉంటే రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఫామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని మంత్రి గారిని కోరారు.



# గిరిజన సంఘం మహాసభలను జయప్రదం చేయాలి

**బానోత్ వెంకన్న నాయక్**



**అక్షరశక్తి, మహబూబాబాద్ :** ఈ నెల 27, 28వ తేదీల్లో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో నిర్వహించనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న నాయక్ కోరారు. మహబూబాబాద్ కోర్టు ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకన్న నాయక్ మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధన కోసం తెలంగాణ గిరిజన సంఘం నిరంతరం పోరాడుతోందన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్ పోరాటాలకు మహాసభలు దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. ఈ నెల 27న తాను నాయక్ నగారా ఉత్సవాలతో మహాసభలు ప్రారంభమవుతాయని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండో రోజు గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బహిరంగ సభకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బానోత్ సీతారాం నాయక్, మాలోత్ కిషన్ నాయక్, బానోత్ ప్రకాష్ నాయక్, అజ్మీర చందు, భీమా నాయక్, మాలోత్ జగన్, బానోత్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఐటీ వరంగల్‌లో హిందీ పఖ్వాడా ప్రారంభం





**అక్షరశక్తి, వరంగల్:** జాతీయ సాంకేతిక సంస్థ (ఎన్ఐటీ) వరంగల్‌లో రాజ్ భాష హిందీ వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో హిందీ పఖ్వాడా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. హిందీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది దైనందిన, అధికారిక సమాచారంలో హిందీ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమానికి డీన్ (ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ గార్జే ముఖ్య అతిథిగా హాజరై అధికారిక నోటింగ్‌తో పాటు రోజువారీ సమాచారంలోనూ రాజ్ భాష హిందీ వినియోగ ప్రాధాన్యాన్ని వివరించారు. రిజిస్ట్రార్ సునీల్ కుమార్ మెహతా రాజ్ భాష హిందీ ప్రాధాన్యతను వివరించి సంస్థ పరిపాలనా, విద్యా కార్యకలాపాల్లో హిందీ వినియోగాన్ని పెంచాలని సూచించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆదేశ్ శ్రీవాస్తవ విద్యా మంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. హిందీ పఖ్వాడాలో భాగంగా హిందీ కవితా పఠనం, వ్యాసరచన, ప్రసంగం, క్విజ్, పదాలు-అనువాద పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు ఆదేశ్ శ్రీవాస్తవ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు.

# బీఎస్పీలో చేరిన ఆకులపల్లి బాబూ, జన్ను స్వామి



**అక్షరశక్తి,వరంగల్:** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో వరంగల్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు చేరారు. మాజీ ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి బాబూ, మాజీ ఎంపీటీసీ జన్ను స్వామి బుధవారం బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు. వరంగల్ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు, ఐఐటీ నిపుణుడు వనం మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ చీఫ్ జోన్ ఇన్‌చార్జి దాగిళ్ల దయానంద్ రావు చేతుల మీదుగా ఆకులపల్లి బాబూ, జన్ను స్వామి పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు బీఎస్పీ సిద్ధాంతాలు, బహుజనుల సంక్షేమం కోసం పార్టీ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

## యువ ఆపద మిత్ర శిక్షణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (కేయూసీఈటీ)కి చెందిన 10 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 'యువ ఆపద మిత్ర' శిక్షణకు ఎంపికయ్యారు. ఎస్డీఆర్ఎఫ్-టీజీఎస్పీ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారం రోజుల శిక్షణ కార్యక్రమం సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు మామ్నూర్‌లోని 4వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ప్రాంగణంలో కొనసాగనుంది. విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు అవసరమైన విపత్తు నిర్వహణ, అత్యవసర స్పందన, రక్షణ చర్యలు, ప్రథమ చికిత్స తదితర అంశాల్లో వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఆకస్మిక విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా యువతను సన్నద్ధం చేయడమే కార్యక్రమ ఉద్దేశమని కేయూసీఈటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.రమణ తెలిపారు. శిక్షణను కాకతీయ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ.నారాయణ పర్యవేక్షిస్తుండగా, ప్రోగ్రామ్ అధికారులు డా.డి.శైలజ, డా.ఎం.సౌజన్య సమన్వయం చేస్తున్నారు. శిక్షణకు ఎంపికైన వాలంటీర్లను ప్రిన్సిపాల్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## యూపీఐ చార్జీల ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి

**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**అక్షరశక్తి, హనుమకొండ:** యూపీఐ చెల్లింపులపై చార్జీల భారం మోపే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యూపీఐ చెల్లింపులపై చార్జీలకు వ్యతిరేకంగా బుధవారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై చార్జీలు వసూలు చేసేందుకు మార్గం సుగమం చేయడం వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలు, చిన్న వ్యాపారులపై భారం పడుతుందని విమర్శించారు. రోజువారీ చిన్న వ్యాపారాలు, కిరాణా దుకాణాల్లో జరిగే లావాదేవీలపై ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందని అన్నారు. యూపీఐని ప్రజలకు తక్కువ ఖర్చుతో, సులభంగా అందుబాటులో ఉండే డిజిటల్ మౌలిక సదుపాయంగా కొనసాగించాలని కోరారు. యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిస్తున్న అన్ని రకాల చార్జీలను ఉపసంహరించుకుని డిజిటల్ చెల్లింపులను ఉచితంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్రె బిక్షపతి, ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎన్.అశోక్ స్టాలిన్, నేదునూరి రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం



**అక్షరశక్తి,వరంగల్:** రంగసాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్, రసాయన శాస్త్ర విభాగాధిపతి శ్రీమతి ఆర్. ప్రేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓజోన్ పొర ప్రాధాన్యత, అల్ట్రా వైలెట్ కిరణాల నుంచి భూమిని రక్షించడంలో దాని పాత్రను వివరించారు. ఓజోన్ పొరను దెబ్బతీసే క్లోరోఫ్లోరో కార్బన్స్, పెట్రో రసాయనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ పోటీలు, ఓజోన్‌పై అవగాహన కల్పించే చిన్న నాటికను నిర్వహించారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. పరమేష్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ పి.ఎల్.ఎన్. మూర్తి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫాంహౌస్ భూములపై సీఎం కొరడా!



- ఎర్రవల్లి ఫాంహౌస్‌పై 30 రోజుల్లో విచారణ పూర్తి చేయాలి
- 700 ఎకరాల భూమిపై కలెక్టర్‌కు రేవంత్ ఆదేశాలు
- అక్రమంగా ఉంటే స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ
- ఎస్సీలను యజమానులుగా చేస్తామని ప్రకటన
- కేసీఆర్ కుటుంబ భూముల వివరాలను అసెంబ్లీలో వెల్లడించిన సీఎం

**అక్షరశక్తి, హైదరాబాద్ :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కీలక ఆదేశాలు జారీ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లిలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని, నిర్ణీత గడువులోగా నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. విచారణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 30 రోజుల్లో విచారణ పూర్తి చేసి ఫాంహౌస్ పరిధిలోని భూములపై స్పష్టత ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు సీఎం తెలిపారు. ఫాంహౌస్ పరిధిలో సుమారు 700 ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొన్న ఆయన.. అందులో ప్రభుత్వ, ఇతర కేటగిరీల భూముల పరిస్థితిని తేల్చాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని, శుద్ధి చేసిన భూమికి ఎస్సీలను యజమానులుగా చేస్తామని ప్రకటించారు.



**22ఏ భూములపై సభలో వాడీవేడి చర్చ**

22ఏ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో భూముల వ్యవహారాల్లో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. తెలంగాణ ఉద్యమం, ధరణి వ్యవస్థను అడ్డుపెట్టుకుని భూముల విషయంలో దోపిడీ జరిగిందని ఆరోపించారు. సత్యం కంప్యూటర్స్ కుంభకోణానికి సంబంధించిన భూముల్లోనే కేటీఆర్ ఫాంహౌస్ ఉందని సీఎం పేర్కొన్నారు. ఆ భూములు కేటీఆర్ బంధువుల పేర్లకు బదిలీ అయ్యాయని ఆరోపించారు. సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో హరీశ్‌రావు ఫాంహౌస్‌కు రహదారులు నిర్మించారని, సాగునీటి అవసరాల కోసం తీసుకున్న భూమిలోనే ఆయన ఫాంహౌస్ ఉందని అన్నారు. హైదరాబాద్ బాలానగర్‌లో 120 ఎకరాల భూమిని హరీశ్‌రావు కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు సైతం భయపడుతున్నారని సీఎం సభలో పేర్కొన్నారు.

**కుటుంబ సభ్యుల పేర్లపై ఎన్ని ఎకరాలో..**

కల్వకుంట్ల కుటుంబానికి చెందిన భూముల వివరాలను కూడా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. తన వివరాల ప్రకారం కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 440 ఎకరాల భూమి ఉందని తెలిపారు. కేసీఆర్ దంపతుల పేర్లపై 67 ఎకరాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేటీఆర్ కుటుంబంలోని నలుగురి పేర్లపై 123 ఎకరాలు ఉన్నాయని చెప్పారు. ఇందులో కేటీఆర్ పేరుపై 49.5 ఎకరాలు, శైలిమ పేరుపై 17.5 ఎకరాలు, అలేఖ్య పేరుపై 9.38 ఎకరాలు, హిమాన్షు పేరుపై 46.3 ఎకరాలు ఉన్నట్లు వివరించారు. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాలు, సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావు పేరుపై 52 ఎకరాలు, కొండల్‌రావు పేరుపై 48 ఎకరాల భూమి ఉన్నట్లు సీఎం సభలో పేర్కొన్నారు.

**'భూములు తేల్చండి.. పేదలకు పంచండి'**

ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల విషయంలో ప్రభుత్వం చేపట్టబోయే చర్యలను సీఎం స్పష్టం చేశారు. భూములపై పూర్తి స్థాయి విచారణ జరిపి, ప్రభుత్వానికి చెందాల్సిన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూమిని 30 రోజుల్లోగా స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఎస్సీలకు భూమిపై యాజమాన్య హక్కులు కల్పిస్తామని తెలిపారు. ఫాంహౌస్ భూములపై కేసీఆర్‌కు తక్షణమే నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

**బీఆర్ఎస్ హయాంపై సీఎం తీవ్ర ఆరోపణలు**

ధరణి, తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై ప్రతిపక్షాల విమర్శలకు సమాధానంగా అసెంబ్లీ వేదికగా వివరాలు వెల్లడించారు. అయితే, సీఎం చేసిన ఆరోపణలు రాజకీయంగా వివాదాస్పదంగా మారే అవకాశం ఉంది. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం, బీఆర్ఎస్ నేతల మధ్య ఇప్పటికే ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి.

## ఉల్లాస్ పరీక్షల లక్ష్యాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్ సత్య శారద

**అక్షరశక్తి,వరంగల్:** జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఉల్లాస్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో ఆమె మాట్లాడారు.



సెప్టెంబర్ 20న నిర్వహించనున్న ఉల్లాస్ పరీక్షకు ఉల్లాస్ పోర్టల్‌లో నమోదైన ప్రతి మహిళ హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మండల స్థాయి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లపై ఉందని కలెక్టర్ తెలిపారు. నమోదైన అభ్యర్థులందరికీ ముందస్తుగా పరీక్షపై అవగాహన కల్పించి, వారు తప్పనిసరిగా పరీక్షకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో లేవని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాకు కేటాయించిన అడ్మిషన్ లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్హులైన విద్యార్థులు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యను కొనసాగించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఉల్లాస్ పరీక్షలు, ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్డీఓ నాగ పద్మజ, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, డీఎంసీ రేణుక, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందం, వరంగల్ జిల్లా ఉల్లాస్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, వివిధ మండలాల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# 13 ప్రాంతాల్లో హైటెక్ బస్టాండ్లు

- బస్‌స్టేషన్లలో వ్యాపార, వినోద సముదాయాలు
- రైల్వే, ఇతర రవాణా వ్యవస్థలతో అనుసంధానం
- ఆసక్తిగల వ్యాపారులకు కమర్షియల్ స్పేస్ కేటాయింపు







**అక్షరశక్తి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్టాండ్ల రూపురేఖలను మార్చేందుకు చర్యలు చేపట్టింది. ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వ్యాపారం, వినోదం, ఇతర రవాణా వ్యవస్థలను అనుసంధానిస్తూ 13 ప్రాంతాల్లో 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్' బస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం, రవాణా శాఖ నుంచి అనుమతులు లభించినట్లు సంస్థ వర్గాలు తెలిపాయి.

**ఒకే చోట రవాణా.. షాపింగ్.. వినోదం**

నూతన బస్‌స్టేషన్లలో మల్టీ మోడల్ కనెక్టివిటీతో పాటు షాపింగ్, బిజినెస్ కాంప్లెక్స్‌లు, ఫుడ్‌కోర్టులు, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు ఏర్పాటు చేయనున్నారు. బస్సు దిగిన ప్రయాణికులు రైలు, ఇతర రవాణా సదుపాయాలను సులభంగా చేరుకునేలా అనుసంధానం కల్పించనున్నారు. బస్‌స్టేషన్లలోని వాణిజ్య సముదాయాల్లో దుకాణాలు, వ్యాపార సంస్థల ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని సంస్థ తెలిపింది. కమర్షియల్ స్పేస్‌ను వ్యాపార అవసరాలకు అనుగుణంగా కేటాయించనున్నట్లు పేర్కొంది.

**ఈ 13 ప్రాంతాల్లో..**

నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్‌నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెంలో నూతన మోడల్ బస్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాలతో పాటు ఆధునిక వాణిజ్య, వినోద వసతులు అందుబాటులోకి రానున్నాయి. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి.

# గైడ్‌కు విషయ పరిజ్ఞానం, ప్లానింగ్ ఎంతో అవసరం





**అక్షరశక్తి,హనుమకొండ:** టూరిస్ట్ గైడ్‌కు వివిధ పర్యాటక ప్రాంతాలపై పూర్తి విషయ పరిజ్ఞానంతో పాటు పర్యటన ప్రణాళికపై అవగాహన ఎంతో అవసరమని డా. సూర్యకిరణ్ అన్నారు. ప్రభుత్వ పింగిలి మహిళా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని 'తెలంగాణ టూరిజం ఫెసిలిటీస్, డెవలప్‌మెంట్ అండ్ టూరిజం ప్రొడక్ట్స్ ఆఫ్ తెలంగాణ' అంశంపై ప్రసంగించారు. టూర్ గైడ్ సందర్శకులకు మార్గదర్శకుడిగా వ్యవహరిస్తూ ముఖ్యమైన సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాల విశేషాలను వివరించాల్సి ఉంటుందని తెలిపారు. రామప్ప దేవాలయం శిల్పకళా సంపదను వివరిస్తూ, దేవాలయ గోడలపై ఉన్న అద్భుతమైన శిల్పాలు, నాట్య భంగిమలు సందర్శకులను ఆకట్టుకుంటాయని తెలిపారు. రెండు రోజుల టూర్ ప్లాన్ రూపొందించేటప్పుడు వాహనం ఎంపిక, సందర్శించాల్సిన ప్రదేశాలు, సమయపాలన, అవసరమైన వస్తువులు తదితర అంశాలను ముందుగానే నిర్ణయించుకోవాలని సూచించారు.

హైదరాబాద్‌లోని చార్మినార్, గోల్కొండ కోట, చౌమహల్లా ప్యాలెస్, కుతుబ్‌షాహీ సమాధులు వంటి చారిత్రక కట్టడాలతో పాటు హస్తకళలు, షాపింగ్ ప్రాంతాలపై కూడా గైడ్‌కు అవగాహన ఉండాలని అన్నారు. అడ్వెంచర్ టూరిజంలో భాగంగా పాండవుల గుట్ట, జలపాతాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్, హరిత హోటల్స్ తదితర పర్యాటక అంశాలను వివరించారు. హోటల్ మేనేజ్‌మెంట్, వివిధ రకాల ఆహార పదార్థాలు, 16 రకాల కాఫీల వంటి అంశాలపై కూడా గైడ్‌కు ప్రాథమిక పరిజ్ఞానం అవసరమని తెలిపారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని అధ్యక్షత వహించగా, సర్టిఫికెట్ కోర్సు కన్వీనర్, చరిత్ర విభాగాధిపతి డా. కొలిపాక శ్రీనివాస్, అధ్యాపకులు డా. పి. నరేష్, డా. బి. జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్పిత నాయకుడు పుస్తకాన్ని ఖండించిన కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం



**అక్షరశక్తి, కేయూక్యాంపస్ :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వ్యక్తిత్వాన్ని, ఆశయాలను కించపరిచేలా 'కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకం రాయడాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. కేయూ గెస్ట్‌హౌస్‌లో ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి పరిమితమైన వ్యక్తి కాదని, ప్రజాస్వామ్యం, సమతా సమాజ నిర్మాణానికి పునాది వేసిన మహనీయుడని పేర్కొన్నారు. 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలని సంఘం డిమాండ్ చేసింది. పుస్తక రచయిత హమారా ప్రసాద్, ఆయన వెనుక ఉన్న కుట్రదారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యోగ, విద్యార్థి, బహుజన సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. సమావేశంలో పి.భాస్కర్, ఎన్.కిరణ్‌కుమార్, బి.రాజు, డి.ఆనందం, బొక్క మొగిలి తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో భూపోరాటాలు

**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**అక్షరశక్తి, భూపాలపల్లి:** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని భూపోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం భూపాలపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ, సభ నిర్వహించారు. కొమరయ్య భవన్ నుంచి బస్టాండ్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 'దున్నేవాడికే భూమి' నినాదంతో భూముల పంపిణీ జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ భూపోరాటాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని విమర్శించారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజలు పోరాడారని అన్నారు. నాటి పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సాయుధ పోరాటంలో వేలాది మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని పేర్కొన్నారు. పోరాట చరిత్ర, అమరుల జీవిత చరిత్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, మోటపలుకుల రమేష్, సుధాకర్‌రెడ్డి, కొరిమి సుగుణ, సుతుకు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న**

**అక్షరశక్తి, మహబూబాబాద్:** ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న పిలుపునిచ్చారు. మహాసభల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వారి హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలను ముందుకు తీసుకెళ్లేందుకు జాతీయ మహాసభలు దోహదపడతాయని అన్నారు. దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మంలో జరిగే మహాసభలకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మైస శ్రీనివాసులు, బాలాస్టి రమేష్, విష్ణువర్ధన్, కమలాకర్, సుధాకర్, రామచంద్రు, రవి, రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, పార్టీ జిల్లా నాయకులు హలావత్ లింగన్న, పీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సామపాపయ్య, బట్టు చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# కేయూ జంతుశాస్త్ర విభాగానికి పేటెంట్

## పరిశోధనలో మరో మైలురాయి



**అక్షరశక్తి, వరంగల్:** కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం పరిశోధనకు భారత ప్రభుత్వ పేటెంట్ లభించింది. విభాగానికి చెందిన ఆచార్య జి. షమితా, పరిశోధకురాలు, పూర్వ విద్యార్థిని మౌనికా జే., హైదరాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల మైక్రోబయాలజీ విభాగ సహాయ ఆచార్యురాలు గాయత్రీ సంయుక్తంగా చేపట్టిన పరిశోధనకు ఈ గుర్తింపు దక్కింది. 'సింథసిస్ ఆఫ్ యాంటీమైక్రోబియల్ సిల్వర్ నానోపార్టికల్స్ ఫ్రమ్ గట్ బ్యాక్టీరియా ఆఫ్ టస్సర్ సిల్క్‌వార్మ్' పేరిట రూపొందించిన ఆవిష్కరణకు పేటెంట్ నంబర్ 596905 కేటాయించారు. 2025 ఆగస్టు 25న దరఖాస్తు చేయగా.. 2026 జూలై 27న పేటెంట్ మంజూరైనట్లు ఆచార్య షమితా తెలిపారు. ఈ ఆవిష్కరణతో టస్సర్ సిల్క్‌వార్మ్‌కు వచ్చే వ్యాధులను నియంత్రించడంతో పాటు పట్టు ఉత్పత్తిని పెంచే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. సుస్థిరమైన సెరికల్చర్ అభివృద్ధికి పరిశోధన దోహదపడుతుందని తెలిపారు. శాస్త్రీయ పరిశోధనలను సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మలచడంలో పేటెంట్ కీలక ముందడుగని అన్నారు. పేటెంట్ పొందిన పరిశోధకులను కేయూ ఉపకులపతి ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, సైన్స్ విభాగాల డీన్, ఓఎస్డీ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి అభినందించారు. విభాగాధిపతి ఆచార్య వై.వెంకయ్యతో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

**న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ**

**అక్షరశక్తి, వరంగల్:** బాలల సంరక్షణ, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ తెలిపారు. బుధవారం వరంగల్ ఆటోనగర్‌లోని పరిశీలన గృహం, దేశాయిపేటలోని ఇండియన్ డిసిపుల్స్ మిషన్ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్, సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లను ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. పరిశీలన గృహం, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లోని బాలలతో న్యాయమూర్తి ఆత్మీయంగా మాట్లాడి వారి విద్య, ఆరోగ్యం, వసతి, భోజనం, భద్రత తదితర అంశాలపై ఆరా తీశారు. బాలల సమస్యలను తెలుసుకుని అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలకు అందుతున్న న్యాయ, కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, పునరావాస సేవలను పరిశీలించారు. బాధితులకు సకాలంలో అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బాలలు, మహిళల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని, అర్హులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పూజ తెలిపారు.



# లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



**అక్షరశక్తి,ములుగు:** లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ పునరావాస ప్రయోజనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు, ఉపాధి అవకాశాలు తదితర పునరావాస ప్రయోజనాలు కల్పించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి పునరావాస ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పునరావాస ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లా అధికారులు రామ్మోహన్, రవీందర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో 'ఎం.టి.టి.ఎస్ ఓవర్‌చర్–2026'

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సెప్టెంబర్ 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎం.టి.టి.ఎస్ (మ్యాథమెటిక్స్ ట్రైనింగ్ అండ్ టాలెంట్ సెర్చ్) ఓవర్‌చర్-2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, కార్యక్రమ అధ్యక్షురాలు ఆచార్య సుంకరి జ్యోతి తెలిపారు. గణితశాస్త్రం, స్టాటిస్టిక్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్లాటినం జూబిలీ సెమినార్ హాల్‌లో రెండు రోజులపాటు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 18న ఉదయం 9 గంటలకు ప్రారంభ సమావేశం జరుగుతుందని, కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. హైదరాబాద్ ఐఐటీ గణితశాస్త్ర విభాగం ఆచార్యులు డి.సుకుమార్ ప్రత్యేక అతిథిగా కీలక ఉపన్యాసం చేస్తారని చెప్పారు. సైన్స్ విభాగాల డీన్, ఓఎస్డీ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి, గణితశాస్త్ర విభాగాధిపతి డా.బి.ఎస్.ఎల్.సౌజన్య పాల్గొంటారని తెలిపారు. ముగింపు సమావేశం సెప్టెంబర్ 19న సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు ఆచార్య పి.మల్లారెడ్డి, పుదుచ్చేరి యూనివర్సిటీ ఆచార్యులు జి.సుగిత గాయత్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎం.రెహమాన్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి డా.టి.నాగయ్య లోకల్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.

# 17న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

**అక్షరశక్తి, మహబూబాబాద్:** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్-2026ను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు. ఎస్సీఈఆర్టీ ఆదేశాల మేరకు మహబూబాబాద్ తెలంగాణ మోడల్ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'ఇండియన్ ఎనర్జీ బాస్కెట్-2047: ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్' అంశంపై విద్యార్థులు తమ ఆలోచనలు, విశ్లేషణలను ప్రదర్శించనున్నారు. 2047 నాటికి దేశ ఇంధన అవసరాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, సౌర, పవన, జల, అణు, బయో ఎనర్జీ, హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అవకాశాలతో పాటు ఇంధన రంగంలో ఎదురయ్యే సవాళ్లపై సెమినార్‌లో చర్చించనున్నారు. గూగుల్ ఫారం ద్వారా నమోదు చేసుకున్న పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించనున్నారు. శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, దేశ భవిష్యత్తుపై బాధ్యతాయుత ఆలోచన పెంపొందించడమే కార్యక్రమ ఉద్దేశమని డీఈఓ తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

# ఈపీఎఫ్ కనీస వేతనం పెంపు

**తాజాగా కేంద్ర కేబినెట్ ఆమోదం**




**అక్షరశక్తి, డెస్క్:** ఈపీఎఫ్ వేతనదారులకు శుభవార్త చెప్పింది ప్రభుత్వం. పీఎఫ్ కనీస వేతన పరిమితి పెంపునకు కేంద్ర కేబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.15 వేల పరిమితిని రూ.25 వేలకు పెంచేందుకు నిర్ణయించింది. దీంతో, కొత్తగా 51 లక్షల మంది ఈపీఎఫ్ఓ కవరేజీ పరిధిలోకి రానున్నారు. పీఎఫ్ కనీస వేతన పెంపుతో మరింత మంది వర్కర్లకు సామాజిక భద్రత లభిస్తుందని కార్మిక శాఖ పేర్కొంది. 2014లో చివరిసారిగా ప్రభుత్వం కనీస వేతనాన్ని రూ.15 వేలకు పెంచింది. వేతనాల వృద్ధి, ఆదాయాల వృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం పీఎఫ్ కనీస వేతనాన్ని పెంచేందుకు నిర్ణయించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, రూ.15 వేలు, అంతకుమించి నెలవారీ వేతనంతో ఉద్యోగంలో చేరే వారు ఆటోమేటిక్‌గా ఈపీఎఫ్ పరిధిలోకి రారు. ఈ పరిమితి పెంపుతో రూ.25 వేల వరకూ వార్షిక వేతనం ఉన్న వారు ఆటోమేటిక్‌గా పీఎఫ్ పరిధిలోకి వస్తారు. పీఎఫ్ సేవింగ్స్, పెన్షన్, ఇన్సూరెన్స్ సదుపాయం వంటివి వారికి అందుబాటులోకి వస్తాయి. వేతన పెంపుపై వివిధ మంత్రిత్వ శాఖలతో సంప్రదింపుల అనంతరం కేంద్రం తుది నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ఓ డేటా ప్రకారం, ప్రస్తుతం 7.98 కోట్ల మంది పీఎఫ్ సభ్యులు ఉన్నారు. 82 లక్షల మందికి పీఎఫ్ పెన్షన్ సదుపాయం ఉంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.